వందేండ్ల కల నెరవేరిన వేళ..

- పోచారం ప్రధాన కాలువపై వంతెన నిర్మాణం పూర్తి
- హామీని నిలబెట్టుకున్న మాజీ ఎమ్మెల్యేలు సురేందర్, జనార్దన్ గౌడ్
- హర్షం వ్యక్తంచేస్తున్న లింగంపల్లి కలాన్ గ్రామస్తులు
- బ్రిడ్జి పైనుంచి రాకపోకలు షురూ..

నాగిరెడ్డిపేట, నవంబర్ 17: వందేండ్ల క్రితం పోచారం ప్రాజెక్టు కట్టిన సమయంలో సాగునీటిని అందించేందుకు ఆ గ్రామం మీదుగా ప్రధాన కాలువను నిర్మించారు. కానీ కాలువపై బ్రిడ్జిని నిర్మించలేదు. దీంతో కాలువ దాటేందుకు రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలువ దాటుతూ ఇప్పటివరకు పలువురు మృతిచెందగా.. పశువులు నీటిలో కొట్టుకుపోయాయి. వానకాలంలో వారి తిప్పలు వర్ణనాతీతం. లేదంటే నాలుగు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామస్తులది. దీంతో ప్రతిసారి ఎన్నికల సమయంలో తమ గ్రామానికి వచ్చే నాయకులకు వారు ముందుగా ప్రధాన కాలువపై వంతెన నిర్మించాలని కోరేవారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన వారు అనంతరం మరిచిపోయేవారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్ నిధులు మంజూరయ్యేలా కృషిచేశారు. ప్రభుత్వం మే 2023లో రూ.50.90లక్షల నిధులను మంజూరు చేసింది. కాంట్రాక్టర్ వంతెన నిర్మాణ పనులను ఇటీవల పూర్తిచేశారు. దీంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. వందేండ్ల కల నెరవేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

లింగంపల్లి కలాన్ గ్రామ శివారులోని పోచారం ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన

చాలా సంతోషంగా ఉన్నది..

వంతెన లేక ఏండ్లుగా ఇబ్బంది పడ్డాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇటీవల పనులు పూర్తి కావడంతో.. వంతెన పైనుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. గ్రామస్తులందరం సంతోష పడుతున్నాం. అప్పుడు చుట్టూ తిరిగి వచ్చే సరికి సగం పొద్దు పోతుండే.. ఇప్పుడు నిమిషం సమయం కూడా పట్టడం లేదు.

- శంకర్, లింగంపల్లి కలాన్

వందేండ్ల కల తీరింది..

వంతెన లేకపోవడంతో వందేండ్లుగా చాలా ఇబ్బందులు పడ్డాం. వంతెన నిర్మాణం పూర్తికావడంతో మా గ్రామస్తుల కల నెరవేరింది. రైతులు పంట పొలాలు, పశువుల మేతకు ప్రతిరోజూ ప్రమాదకరంగా కాలువను దాటి వెళ్లాల్సి వచ్చేది. వంతెన నిర్మాణంతో ఇబ్బందులు తొలిగిపోయాయి. ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నది.

- ఆంజనేయులు, లింగంపల్లి కలాన్

ఆర్టీసీ బస్సు, బైకు ఢీ

ఒకరి దుర్మరణం

మాచారెడ్డి, నవంబర్ 17: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన మాచారెడ్డి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చుక్కాపూర్ గ్రామానికి చెందిన వోడ్డెపల్లి నర్సింగ్ రావు (55) తన కూతురితో కలిసి బైక్‌పై మాచారెడ్డి ఎక్స్‌రోడ్‌కు వెళ్తున్నాడు. మాచారెడ్డి బస్టాండ్ నుంచి బయటికి వస్తున్న బస్సు బైకును ఢీకొన్నది. దీంతో తీవ్ర గాయాలైన అతడిని కామారెడ్డి దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందాడు. నర్సింగ్‌రావు గతంలో చుక్కాపూర్ ఉపసర్పంచ్‌గా పనిచేశాడని స్థానికులు తెలిపారు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

పోలీస్‌స్టేషన్‌లో ఇసుక వాహనాలు

బిచ్కుంద, నవంబర్ 17: మండలంలోని ఖత్‌గావ్ గ్రామ మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు బిచ్కుంద పోలీసులు తెలిపారు. ప్రకాశ్, శేషారావు తమ టాటా ట్రక్కుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

వాహనదారులు ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలి

వాహనదారుడితో మాట్లాడుతున్న ఎస్సై మోహన్‌రెడ్డి

బిచ్కుంద, నవంబర్ 17: వాహనదారులు అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని ఎస్సై మోహన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల ధ్రువ పత్రాలను పరిశీలించారు. పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని వాహనదారులకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్ట్‌ను తప్పకుండా ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతోనే ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన ధ్రువపత్రాలు లేని పలువరికి జరిమానా విధించారు. తనిఖీల్లో ఆయన తోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధనస్వామ్య పెట్టుబడుదారి వ్యవస్థ కొనసాగుతున్నది

భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి

సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

కామారెడ్డి, నవంబర్ 17: ప్రస్తుతం ప్రజాస్వామ్యం పేరుతో ధనస్వామ్య పెట్టుబడిదారి వ్యవస్థ కొనసాగుతున్నదని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. కామారెడ్డిలో కౌన్సిల్ సమావేశాన్ని మంద రాజమణి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. ప్రాంతాలు, తెగలు, కులాలు, వ్యక్తుల మధ్య నేటి పాలకవర్గాలు అసమానతలను సృష్టిస్తూ ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల శ్రమశక్తిని దోచుకుంటున్నారన్నారు. కుల, వర్గ సమాజాన్ని నిర్మూలించి వర్గ రహిత సమాజాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఐక్య ఉద్యమాలు చేయాల్సిన ఆవశ్యకత ఉన్నదన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 23, 24వ తేదీల్లో కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, సహాయ కార్యదర్శి బాలరాజుతోపాటు మౌలామ్‌బీ, లక్ష్మి, గంగామణి, సుజాత, లక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్‌లో ఉద్యోగ నియామకాలు

కామారెడ్డి, నవంబర్ 17: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ (108) సంస్థలో నేడు(సోమవారం) నుంచి ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ (బీజెడ్‌సీ), బీఎస్సీ నర్సింగ్ చదివి, 30ఏండ్లలోపు వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులకు కామారెడ్డిలోని పాత ఎమ్మార్వో కార్యాలయంలో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలను హాజరు కావాలని సూచించారు. రెండు రోజులపాటు నియామకాలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు తమవెంట అన్ని ఒరిజినల్, జిరాక్స్ ధ్రువ పత్రాలను తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9100799153 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పుస్తె, మెట్టెల వితరణ

పుస్తె,మెట్టెలను అందజేస్తున్న గ్రామస్తులు

బిక్కనూరు, నవంబర్ 17: అనాథ బాలిక వివాహానికి ప్రముఖ విద్యావేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి చేయూతను అందించారు. మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన శ్రావణి వివాహానికి ఆయన పుస్తె,మెట్టెలను గ్రామస్తుల ద్వారా బహూకరించారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

విరాళాలను సేకరిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

లింగంపేట, నవంబర్ 17: లింగంపేటలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించేందుకు 60 గుంటల భూమిని కొనుగోలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం లింగంపేట గౌడ సంఘం నాయకులు రూ.రెండు లక్షలు, లింగంపేట సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి రూ.లక్షా 11వేలు, రైస్ మిల్ యజమాని రవికుమార్ గుప్తా రూ.లక్షా11 వేలు, ముప్పిడి నగేశ్ రూ.51వేలు, తాండ్లే దశరథం రూ.51 వేలు, వంజరి ఎల్లమయ్య రూ.51వేలు ఆదివారం అందజేశారు. లింగంపేట నుంచి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కోటి రూపాయల నిధులను మంజూరు చేయించారని ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు.

డివైడర్ల మధ్య మొక్కలకు రక్షణ కరువు

డివైడర్ల మధ్యలో నాటిన మొక్కలను మేస్తున్న మేకలు

గాంధారి, నవంబర్ 17: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న సెంటర్ డివైడర్‌లో నాటిన మొక్కలు మేకల పాలవుతున్నాయి. డివైడర్ మధ్యలో నాటిన మొక్కలకు రక్షణగా గ్రామ పంచాయతీ వారు ట్రీగార్డులు ఏర్పాటు చేసినప్పటికీ, ట్రీగార్డులపైకి ఎక్కి మరీ మొక్కలను తింటున్నాయి. రోడ్డు మధ్యలో నాటిన మొక్కలను ప్రతి రోజూ మేకలు మేస్తుండడంతో, మొక్కలు నాటి నాలుగు నెలలు గడుస్తున్నా అవి పెరగడం లేదు. గ్రామంలో కొంతమంది తాము పెంచుకుంటున్న మేకలను రోడ్ల పైకి వదిలి పెడుతుండడంతో, అవి మొక్కలను యథేచ్ఛగా తింటున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు.. అధికారులతో పాటు గ్రామపంచాయతీ వారికి చాలా సార్లు తెలిపినప్పటికీ మేకల యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వారు ఇష్టానుసారంగా మేకలను రోడ్లపైకి వదిలిపెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మేకలను రోడ్లపైకి వదిలిపెడుతున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్17: ఎల్లారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో కుల గణన సర్వే కొనసాగుతున్నట్లు ఎంపీడీవో ప్రకాశ్ తెలిపారు. ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంతోపాటు మండలంలోని కళ్యాణి, తిమ్మారెడ్డి, భిక్నూర్, సోమార్‌పేట్, దేవునిపల్లి, మీసాన్‌పల్లి, లక్ష్మాపూర్, అడివిలింగాల తదితర గ్రామాల్లో సర్వే కొనసాగుతున్నది. ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చిన సమయంలో పూర్తి వివరాలు తెలిపి సహకరించాలని సూచించారు.

బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

వైభవంగా బోనాల పండుగ

లింగంపేట, నవంబర్ 17: మండలంలోని మెంగారం గ్రామంలో ఆదివారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా గ్రామంలో ఆదివాసీ నాయక్ పోడ్ కులస్తులు బోనాలను ఊరేగించారు. అందంగా అలంకరించిన బోనాలను డప్పు చప్పుళ్లతో గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. గ్రామంలోని బద్ది పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ సంఘం అధ్యక్షుడు పుట్ట దత్తు, బాలు, రాములు, బాల సాయిలు, బాల పోచయ్య, మహిళలు పాల్గొన్నారు.

24న బాన్సువాడకు గరికపాటి

బాన్సువాడ టౌన్, నవంబర్ 17: ప్రముఖ అవధాని, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ఈనెల 24వ తేదీన బాన్సువాడ పట్టణానికి రానున్నట్లు అయ్యప్ప ఆలయ నిత్యాన్నదాన కమిటీ బాధ్యులు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 24న సాయంత్రం నాలుగు గంటలకు గరికపాటి ప్రవచనాలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. భక్తులు, అభిమానులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించిన హద్రితి

పతకాన్ని చూపుతున్న చిన్నారి

నాగిరెడ్డిపేట, నవంబర్17: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామానికి చెందిన బద్దిగారి హద్రితి ద్వితీయ స్థానంలో నిలిచింది. బొల్లారం గ్రామానికి చెందిన బద్దిగారి అశోక్‌గౌడ్ - నీరజ దంపతుల కూతురు హద్రితి నిజామాబాద్‌లోని ఇంద్రాని స్కూల్‌లో ఫస్ట్ క్లాస్ చదువుతోంది. 18కేజీల విభాగంలో హద్రితి రెండోస్థానంలో నిలవడంతో మండల ప్రజలు, బంధువులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, నవంబర్ 17: మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఒడిబియ్యం, పట్టెనామాలు, కోర మీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబర్ 17: నియోజకవర్గం పరిధిలోని 181మంది లబ్ధిదారులకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. బాన్సువాడ మండలంలో 28, బాన్సువాడ రూరల్‌లో 36, బీర్కూర్ మండలంలో 51, నస్రుల్లాబాద్ మండలంలో 66 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి అందజేశారు. రూ.కోటీ81 లక్షల20వేల996 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

లింగంపేటలో చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లు

లింగంపేట, నవంబర్17: లింగంపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం కొనసాగుతున్నదని సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సహకార సంఘం పరిధిలోమొత్తం 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 1,294 మంది రైతుల నుంచి 2.17లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. మరో 2.70 లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. రైతుల వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, ప్రభుత్వం డబ్బులను నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. ఆయనతోపాటు సీఈవో పెంటయ్య, సిబ్బంది, రైతులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I,GORRELA SHANKARAIAH (OLD NAME) S/o ERRANNA, R/o. H.No. 1-1, , Vill,Konapur, Mdl, Kammarpally ,Nizamabad,Dist. Changed My Name as GORRE SHANKAR (NEW NAME) S/o. GORRE CHINNA RAJANNA ,Holding Passport No:F4926989, Date of Issue 11-11-2005,Date of Expirty 06-11-2015.
NTZ-334791

PLOT FOR SALE

★డిచ్‌పల్లి నుండి ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76=202 Sq.yds. ప్లాట్ల ధర 20,000/- గజం మరియు 34x27=102 Sq.yds. ప్లాట్ల ధర 15,000/- గజం అమ్మకానికి కలవు. Ph: 9396411685 / 9493984827.
NT-336743

CHANGE OF NAME

★I, SABA JAHAN HAQQANI (OLD NAME) D/o. M.A. KALEEM HAQQANI Changed My Name as SHAIK SABA JAHAN W/o. SHAIK JAVEED (NEW NAME) R/o. H.No. 2-71/1, Vill : Gummiryal Yergatla Mdl, Dist. Nizamabad.
NTZ-334793

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బిచ్కుంద, నవంబర్ 17: కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు నాల్చర్ బాలాజీ అన్నారు. బిచ్కుంద మార్కెట్ యార్డులో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు ఎకరాల వరకు ఎకరాకు పది క్వింటాళ్ల సోయాలను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంజు తదితరులు ఉన్నారు.

గాంధారి సంతలో పప్పు దినుసులకు భలే డిమాండ్

గాంధారి సంతలో పప్పులు కొనుగోలు చేస్తున్న మహిళలు

గాంధారి, నవంబర్ 17: మండల కేంద్రంలోని వారాంతపు సంతలో పప్పు దినుసులకు డిమాండ్ ఏర్పడింది. ప్రతి ఆదివారం మండల కేంద్రం గాంధారిలో నిర్వహించే సంతకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. దీంతో బాన్సువాడ, పిట్లం, బిచ్కుంద తదితర మండలాల నుంచి వ్యాపారులు పెద్ద ఎత్తున పప్పు దినుసులను తీసుకువచ్చి అంగడిలో విక్రయిస్తున్నారు. నాణ్యతను బట్టి పెసర పప్పు కిలోకు రూ.130 నుంచి 140, మినపప్పు 140 నుంచి 150, కంది పప్పు 180 నుంచి 200, జొన్నలు 60, గోధుమలు రూ.50 కిలో చొప్పున విక్రయిస్తున్నారు. సీజన్ కావడంతో పప్పులు కొనుగోలు చేయడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో అంగడి పరిసరాలు జనాలతో కిక్కిరిసిపోతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి పప్పుల ధరలు బాగా పెరిగాయని ప్రజలు అంటున్నారు.